క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు, దాతలు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన ఫర్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 35 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. ట్రస్టు చైర్మన్ విశ్వనాథ హరికుమార్ మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు చెరుకూరి నాగరాజు, విశ్రాంత రైల్వే ఉద్యోగి రమణ సహకారంతో వృద్ధులకు సరుకులు పంపిణీ చేశామని చెప్పారు. విన్నకోటి సతీష్, పూసర్ల సాయి, మామిడి రమేష్, ట్రస్టు సభ్యులు రవి,శ్రావణ్ కుమార్, గోవిందరావు పాల్గొన్నారు.

పెన్సనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న పెన్సనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పారావు

గంట్యాడ: రాష్ట్ర ప్రభుత్వ పెన్సనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దింటి అప్పారావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పింఛన్‌దారుల సంఘం మండల శాఖ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముందుగా మండలశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఎం.ఎస్.ఎన్.రాజు, కార్యదర్శిగా బూడి సత్యనారాయణ, ఉపాధ్యాక్షులుగా యడ్ల పైడపునాయుడు, సాంబమూర్తి, వేణుగోపాలరావు, శివవర్మ, గౌరవ అధ్యక్షుడిగా జాగరపు అప్పలనాయుడును సభ్యులు ఎన్నుకున్నారు.

మండల ప్రత్యేక అధికారిగా రాజ్‌కుమార్

చీపురుపల్లి: మండల ప్రత్యేక అధికారిగా జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ ఎ.రాజ్‌కుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ ఏ.సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇది వరకు మండల ప్రత్యేక అధికారిగా ఉన్న మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ నిర్మలాకుమారి స్థానంలో డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

మహిళలకు జాబ్‌మేళా రేపు

చీపురుపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ) ఆధ్వర్యంలో క్యాడ్‌బరీ ఇండియా లిమిటెడ్ పరిశ్రమ ఈనెల 7న మహిళల కోసం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.కృష్ణాజీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని సెమినార్ హాల్‌లో ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ప్రారంభం కానుందని, 18 ఏళ్ల నుంచి 21 ఏళ్లలోపు కలిగి, ఇంటర్మీడియట్ ఏకకాలంలో ఉత్తీర్ణత సాధించి డిగ్రీ వరకు చదువుకున్న యువతులు అర్హులని పేర్కొన్నారు.

12న మజ్జిగౌరమ్మ, భద్రకాళి యాత్ర

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంతలోని మజ్జిగౌరమ్మ, భద్రకాళి అమ్మవార్ల ఆలయం వద్ద ఈనెల 12న యాత్ర నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, ఆలయ ధర్మకర్త జగదీష్‌నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయనున్నామని, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

నేడు 'స్పందన'

కొత్తవలస/లక్కవరపుకోట/దత్తిరాజేరు: ప్రజా సమస్యల పరిష్కారవేదిక 'స్పందన' కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించనున్నట్లు కొత్తవలస, లక్కవరపుకోట, దత్తిరాజేరు ఎంపీడీఓలు వై.పద్మజ, కె.రూపేష్, సుబ్రహ్మణ్యం ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అన్ని శాఖల అధికారులు హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయవచ్చని పేర్కొన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని, మండల స్థాయిలో సమస్యలు పరిష్కారం కాకుంటేనే జిల్లాస్థాయి స్పందన కార్యక్రమానికి వెళ్లాల్సి ఉంటుందని, నేరుగా జిల్లా స్థాయి స్పందనలో అర్జీలు అందిస్తే అనుమతించరని తెలిపారు. ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

రామ్మోహన్‌రావుకు ఘన నివాళి



రామ్మోహన్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

శృంగవరపుకోట: నేషన్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకుడు పి.రామ్మోహన్‌రావు వర్ధంతిని పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆర్టీసీ ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిపో కార్యదర్శి ఏ.రాజయ్య, ప్రెసిడెంట్ జి.వి.రమణ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల భద్రతకు రామ్మోహన్‌రావు చేసి కృషి మరవలేనిదని అన్నారు.

ఊపందుకున్న 'ఉపాధి'

- గజపతినగరం క్లస్టర్ పరిధిలో చురుగ్గా ఉపాధి పనులు
- 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వందరోజులు పని పూర్తికాని వేతనదారులకు పనులు
- పనులకు హాజరవుతున్న 26 వేల మంది
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో 60 వేల మందికి పనులు కల్పించేందుకు లక్ష్యం
- ఏప్రిల్ నుంచి ప్రారంభం కానున్న కొత్త పనులు



గజపతినగరం మండలం కాలంరాజుపేటలో పనులు చేస్తున్న వేతనదారులు



బొబ్బిలి మండలంలోని వెంగళరాయ్‌సాగర్ చానెల్‌లో పూడికలు తీస్తున్న వేతనదారులు



బొండపల్లి మండలం జె.గుమడాంలో మామిడి తోటలో ట్రెంచింగ్ పనులు చేస్తున్న వేతనదారులు

గజపతినగరం: గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పేదల జీవితాల్లో ఆర్థిక వెలుగులు నింపుతోంది. ఉన్న ఊర్లోనే ఉపాధి దొరుకుతుండడంతో ప్రజలు సంతోషంగా జీవనం సాగిస్తున్నారు. గజపతినగరం క్లస్టర్ పరిధిలోని బొండపల్లి, గజపతినగరం, మెంటాడ, దత్తిరాజేరు, రామభద్రపురం, బొబ్బిలి మండలాల్లో ఉపాధి పనులు చురుగ్గా జరుగు తున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వంద రోజులు పనిదినాలు పూర్తికాని వారికి ప్రస్తుతం పనులు కల్పిస్తున్నారు. సుమారు 26 వేల మంది వేతనదారులు పనులకు హాజరవుతున్నారు. చెరువుల్లో, సాగునీటి కాలువల్లో పూడికలు తీయడం, మామిడి, జీడి తోటల్లో ట్రెంచ్ పనులు చేస్తున్నారు. నిర్దేశిత కొలతల మేరకు పనులు చేస్తున్న వారికి రోజుకు రూ.240 వరకు వేతనం అందుతోంది. ప్రతీవారం వేతనదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేస్తోంది.

కొత్త పనుల గుర్తింపు

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులు ఏప్రిల్ నుంచి ప్రారంభం కానున్నాయి. చేపట్టాల్సిన పనులపై ఇప్పటికే అధికారులు అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. రైతులు, ప్రజలకు ఉపయోగకరమైన పనులను గుర్తించి తీర్మానాలు చేశారు. ప్రాధాన్యతక్రమంలో పనులను చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. గజపతినగరం క్లస్టర్ పరిధిలో సుమారు 60 వేల మందికి పని కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

గరిష్ట వేతనం అందేలా పనులు



ప్రస్తుతం 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మిగులు పనులు జరుగుతున్నాయి. 26 వేల మంది వేతనదారులు పనులకు హాజరవుతున్నారు. వేతనదారులకు గరిష్ట వేతనం అందేలా పనులు చేయిస్తున్నాం. ఫీల్డ్‌అసిస్టెంట్లు మస్తర్లను తప్పనిసరిగా ఎన్ఎంఎంఎస్ సెంట్రల్ యాప్‌లో నమోదు చేయాలి. గజపతినగరం క్లస్టర్ పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 60వేల మందికి ఉపాధి పనులు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశాం.

– టి.జనార్దనరావు, ఉపాధి హామీ ఏపీడీ

నవధాన్యాల సాగు.. నేలతల్లి బాగు



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

గజపతినగరం రూరల్: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని, రైతులు అంతా నవధాన్యాల సాగుకు ముందుకు రావాలని ప్రకృతి వ్యవసాయ శిక్షకులు సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని సీతారామపురం గ్రామంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ వరి పంట వేయాలనుకునే పొలాల్లో 45 రోజులు ముందుగా నవధాన్యాలు చల్లాలని చెప్పారు. చేను ఏపుగా పెరిగినతర్వాత కలియదున్నాలని సూచించారు. వీటి సాగువల్ల భూమి గుల్లబారుతుందని, నీటిని బాగా పీల్చుకుంటుందని, సూక్ష్మపోషకాలు వృద్ధి చెందుతాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ యోగా టీచర్లకు పురస్కారాలు



శృంగవరపుకోట: విజయలక్ష్మిని సత్కరించి ధ్రువపత్రం అందజేస్తున్న నిర్వాహకులు



చీపురుపల్లి : ఉత్తమ యోగా టీచర్ అవార్డు అందుకున్న గవిడి సుజాత

శృంగవరపుకోట/ చీపురుపల్లి: ఎస్.కోట పట్టణ కేంద్రానికి చెందిన సెంటర్ ఫర్ యోగా అండ్ మెడిటేషన్(సిమ్) సంస్థ డైరెక్టర్ వై.విజయలక్ష్మి, చీపురుపల్లిలోని శ్రీ చైతన్య యోగా సంస్థ టీచర్ గవిడి సుజాత 'సూర్య యోగా 'పురస్కారం అందుకున్నారు. తిరుపతికి చెందిన సూర్య యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గజపతినగరం మండలంలోని గంగచోళ్లపెంటలో జ్ఞానానంద భారతిస్వామి ఆధ్వర్యంలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల యోగా టీచర్ల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాలో ఉత్తమ సేవలు అందిస్తున్న యోగా టీచర్లకు సూర్య యోగా ఫౌండేషన్ వారు పురస్కారాలు ప్రదానం చేసి, సత్కరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ కరణం యుగేంద్రపిల్లై, డాక్టర్ ఏ.ఇందుమణి, న్యాయవాది శీర వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పశలమ్మ తీర్థం



శృంగవరపుకోట: పూజలందుకుంటున్న పశలమ్మ తల్లి

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామదేవత పశలమ్మ తల్లి తీర్థమహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ గాలి సన్యాసయ్య తదితర గ్రామపెద్దల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. పలుసాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ముగిసిన గొల్లపేరంటాలమ్మ జాతర

చీపురుపల్లి రూరల్: మండలంలోని మెట్టపల్లి గ్రామంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన గొల్ల పేరంటాలమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. ఆఖరి రోజు అమ్మవారిని గ్రామంతో పాటు చుట్టు పక్క గ్రామాలకు చెందిన భక్తులు, జెడ్పీటీసీ దంపతులు వలిరెడ్డి శిరీష, శ్రీనివాసనాయుడు దర్శించుకున్నారు.

నేడు ఆంజనేయ స్వామి తీర్థం

జామి: మండలంలోని గొడికొమ్ము గ్రామంలో పంచముఖ ఆంజనేయస్వామి తీర్థం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వామివారికి విశేష పూజలు చేయనున్నామని, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి హామీ



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: మండలంలోని గజపతినగరం పంచాయతీ పరిధిలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య హామీ ఇచ్చారు. గజపతినగరం పంచాయతీ పరిధి మధుర గ్రామం ఎం.వెంకటాపురంలో ఎమ్మెల్యేను పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు, పెద్దలు ఆదివారం కలిసి సమస్యలు వివరించారు. గజపతినగరం దిగువ వీధిలోని బీసీ కాలనీ శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని, ఎం.వెంకటాపురం గ్రామంలో శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించడంతో పాటు గ్రామంలో పాత చెరువుకు సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

క్వారీ కార్మికుల చర్చలు విఫలం

కొత్తవలస: మండలంలోని అప్పన్నదొరపాలెం గ్రామ సమీపంలోని భాస్కర్ మినరల్స్ క్వారీ కార్మికులు సుమారు 150 మంది వేతనాల పెంపు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నుంచి సమ్మె చేస్తున్నారు. తమ డిమాండ్ల సాధనకై క్వారీ యాజమాన్య ప్రతినిధి చిట్టిబాబుతో సీఐటీయూ నాయకులు తమ్మినేని సూర్యనారాయణ, గాడి అప్పారావు ఆధ్వర్యంలో ఆదివారం కార్మికులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. కార్మికుల డిమాండ్లను ఆరు నెలల తర్వాత నెరవేర్చుతామని యాజమాన్యం చెప్పడంతో కార్మికులు అసహనం వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించకుంటే విధుల్లోకి చేరే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కనీసం మూడు నెలల్లో డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చినా విధుల్లోకి చేరుతామని చెప్పినప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడంతో సమ్మె కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లి రూరల్: చీపురుపల్లి మండలంలోని గచ్చలవలస, గరివిడి మండలం నాగళ్లవలస విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధి గ్రామాలకు సోమవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం తలెత్తనుందని ఆర్ఈసీఎస్ ఏడీ బి జగన్నాథం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్లకొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో గచ్చలవలస సబ్‌స్టేషన్ పరిధి గచ్చలవలస, బెవరపేట, బొబ్బాదిపేట గ్రామాలకు, నాగళ్లవలస సబ్‌స్టేషన్ పరిధిలో తోండ్రంగి, శేరీపేట, దువ్వాం, కోడూరు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గజపతినగరం మండలంలో..

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోతో పాటు ఎం.వెంకటాపురం, పురిటిపెంట గ్రామాలకు సోమవారం ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తనుందని విద్యుత్‌శాఖ ఏఈ శివకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మెరకముడిదాం మండలంలో...

మెరకముడిదాం: మండలంలోని గర్భాం, సోమలింగాపురం, గరుగుబిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఆయా సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఆర్ఈసీఎస్ ఏడీ జగన్నాథం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గర్భాం సబ్ స్టేషన్ పరిధి గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, సోమలింగాపురం సబ్ స్టేషన్ పరిధి గ్రామాలకు 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు, గరుగుబిల్లి సబ్ స్టేషన్ పరిధి గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమ పరిపాలనకు మద్దతు ఇవ్వండి

- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అప్పలనరసయ్య



చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



గజపతినగరం: పురిటిపెంటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



గజపతినగరంరూరల్: సీతారామపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య



గుర్ల: నడుపూరులో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు



కొత్తవలస: కొత్తవలసలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



లక్కవరపుకోట: గంగుబూడి గ్రామంలో ప్రచారం చేస్తున్న వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు

చీపురుపల్లి: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పరిపాలన కొనసాగేందుకు పట్టభద్రులు తమ ఓటు ద్వారా మద్దతు పలకాలని గ్రాడ్యుయేట్ ఓటర్లను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కోరారు. పట్టణంలోని హడ్కోకాలనీ, పాతగవిడివీధి తదితర ప్రాంతాల్లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఆదివారం నిర్వహించారు. ఓటు హక్కు ఉన్న పట్టభద్రుల నివాసాలకు వెళ్లి సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మద్దతు తెలపాలని కోరారు. యువత, నిరుద్యోగులకు మేలు చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షలాది మంది నిరుద్యోగులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగ అవకాశాలు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. పోలీస్ శాఖతో పాటు వైద్య ఆరోగ్యశాఖలో చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఉద్యోగ నియామకాలు జరిగాయన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉపాధి అవకాశాలు రావాలంటే వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, ఇప్పిలి తిరుమల తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించండి

గజపతినగరం/ గజపతినగరం రూరల్: ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని ఎం.వెంకటాపురం, పురిటిపెంట, గజపతినగరం, సీతారామపురం, పిడిశీల, కాలంరాజుపేట, దోలపాలెం గ్రామాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని పట్టభద్రులను కోరారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సీఎం జగన్ వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలతో లక్షల మంది పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోగలుగుతున్నారని వివరించారు. అలాగే ఆయా గ్రామాల్లో గృహసారథులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ నెల 18 నుంచి 'మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లోనూ నిర్వహించాలని సూచించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని, వారి సమస్యలను తెలుసుకోవాలని చెప్పారు. జెడ్పీటీసీ గార తవుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూడి వెంకటరావు, పురిటిపెంట వైస్ సర్పంచ్ మండల సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, జేసీఎస్ కన్వీనర్ కె.సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు బెల్లాన త్రినాథరావు, సామంతుల పైడిరాజు, పల్లి సంజీవరావు, రేగ సురేష్, గురుగుబిల్లి సత్యనారాయణ, గజపతినగరం సర్పంచ్, వైస్ సర్పంచ్‌లు నరవ కొండమ్మ, కర్రి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి

గుర్ల: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ తరఫున మండలంలోని నడుపూరు, భూపాలపురంలో జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు ఆదివారం ప్రచారం చేశారు. పట్టభద్ర ఓటర్లను కలిసి తమ మొదటి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేయాలని అభ్యర్థించారు. నడుపూరు గ్రామ సర్పంచ్ తాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస, ఎల్.కోట మండలంలో..

కొత్తవలస/ లక్కవరపుకోట: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్ర ఓటర్లను వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఆదివారం సాయంత్రం కొత్తవలసలో మండల గృహసారథులు, సచివాలయాల కన్వీనర్ల కో-ఆర్డినేటర్ బొంతల వెంకటరావు, నాయకులు గొరపల్లి రవి,పలువురు వార్డు మెంబర్లు ప్రచారంలో పాల్గొన్నారు. ఎల్.కోట మండలం గంగుబూడి, శ్రీరాంపురం, తామరాపల్లి గ్రామాల్లో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్, రాష్ట్ర నూర్ సాహిబ్ దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్లు దొడ్డు రాంబాబు, ఎస్కే మదీనా ప్రచారం నిర్వహించారు.

పాఠశాలలో సైకిల్ షెడ్ ప్రారంభం



సైకిల్ షెడ్‌ను ప్రారంభిస్తున్న దాత వరప్రసాద్ కుటుంబీకులు

వేపాడ: వల్లంపూడి గ్రామానికి చెందిన దబ్బి చెల్లయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు చిదంబర వరప్రసాద్ వేపాడ ఉన్నత పాఠశాలలో సైకిల్ షెడ్ నిర్మాణానికి రూ. 2 లక్షలు ఆర్థిక సహాయం చేశారు. ఈ నిధులతో నిర్మించిన షెడ్‌ను హెచ్ఎం ఎస్.ఎస్.వల్లీ ఆధ్వర్యంలో దాత కుటుంబీకులు ఆదివారం ప్రారంభించారు. దబ్బి చెల్లయ్య భార్య అప్పలకొండమ్మ, వారి కుమారుడు వెంకటరావు రాంబాబు, కుమార్తె శేషుకుమారి, గ్రామపెద్దలు ఎస్.అప్పారావు, ఆర్.వెంకటరావు, ఉపాధ్యాయుడు చిరంజీవి పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్పులు అందజేత

గుర్ల: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు ఓటర్ స్లిప్పులు అందజేయాల్సిన బాధ్యత బీఎల్ఓలదేనని తహసీల్దార్ పద్మావతి తెలిపారు. గ్రామాలవారీగా పట్టభద్రుల ఓటర్ స్లిప్పులను తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలకు కార్యాలయ సిబ్బంది ఆదివారం అందజేశారు. మండలంలో 1,360 మంది పట్టభద్రులకు ఓటు హక్కు ఉందని, వారందరికీ తప్పనిసరిగా స్లిప్పులు అందించాలని తహసీల్దార్ ఆదేశించారు.విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మానవ మనుగడకు మహిళే ఆధారం

విజయనగరం: మానవ మనుగడకు మహిళే ఆధారమని కుసుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుసుమంచి సుబ్బారావు అన్నారు. ఆదివారం ఉదయం స్థానికజీయర్ కాంప్లెక్స్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ, కుసుమంచి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ తల్లిగా, చెల్లిగా, అనురాగవల్లిగా పురుషుని జీవితంలో ప్రతి మలుపులో మహిళ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. ఏపీ గ్రంథాలయ సంఘం మహిళా విభాగం జిల్లా కార్యదర్శి గిరిజా ప్రసన్న మాట్లాడుతూ, స్త్రీలు పూజించే ప్రదేశంలో దేవతలు కొలువైయుంటారని తెలిపారు. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలు డాక్టర్ స్వప్న హైందవి, డాక్టర్ బి. రాధికారాణి, ఊహా మహంతి, ఉషాకామేశ్వరి, పద్మ, పద్మజలను సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంఘ జిల్లా అధ్యక్షుడు గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.